క్లుప్తంగా

నేడు కౌన్సిల్ సమావేశం జరిగేనా!

సామర్లకోట: ప్రతి నెల 31వ తేదీలోపు కౌన్సిల్ పాలక మండలి సమావేశం నిర్వహించాల్సి ఉంది. దీనికి సంబంధించి సాధారణ సమావేశం నిర్వహిస్తే నాలుగు రోజులు ముందుగా, అత్యవసర సమావేశం నిర్వహిస్తే 24 గంటలు ముందుగా అజెండాను సభ్యులకు అందజేయాల్సి ఉంది. అయితే శుక్రవారం 8 గంటల వరకు తమకు అజెండా అందలేదని కౌన్సిల్ సభ్యుడు ఆవాల లక్ష్మీనారాయణ, నేతల హరిబాబు తెలిపారు. ఇటీవల మున్సిపాలిటీలో జరిగిన రాజకీయ పరిణామాల మేరకు అజెండాపై ఎవరి సంతకం తీసుకోవాలనే మీమాంస ఏర్పడింది. ఈ మేరకు సీడీఎంఏ నిర్ణయం కోసం కమిషనర్ వేచి ఉన్నారు. అయితే సీడీఎంఏ చైర్‌పర్సన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించాలని సూచించినట్టు తెలిసింది. అయితే లిఖిత పూర్వకంగా లేఖ ఇవ్వాలని కమిషనర్ కోరడంతో దానికి సీడీఎంఏ అంగీకరించక పోవడంతో అజెండాపై సంతకం చేయించలేదని తెలిసింది. అయితే శనివారంతో ఈ నెల పూర్తి కావడంతో సమావేశం జరుగుతుందా లేదా అని సభ్యులు చర్చించుకుంటున్నారు. కౌన్సిల్ సమావేశం జరిగిన సమయంలో మాత్రమే వారికి గౌరవ వేతనం అందుతుంది. దీనిలో భాగంగానే ఎన్నికల సమయంలో కూడా సమావేశాలు నిర్వహించారు. వరుసగా మూడు నెలల పాటు కౌన్సిల్ సమావేశాలు జరుగక పోతే కౌన్సిల్ రద్దయ్యే అవకాశం ఉంది. ఏం జరుగుతుందా అనే చర్చ జోరుగా జరుగుతుంది.

విద్యార్థులకు కంటి పరీక్షలు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పెద్దాపురం: స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలోని పీసీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిబిరంలో భాగంగా శుక్రవారం విద్యార్థులకు కంటి పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. పెద్దాపురం కిరణ్ కంటి ఆసుపత్రి ఇన్‌చార్జి ప్రసాద్ ఆధ్వర్యంలో బాలనేత్ర బంధు కో–ఆర్డినేటర్ శివగణేష్ నేతృత్వంలో ఈ పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏటా ఓసారి విద్యార్థులందరూ పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. పీసీసీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించి విద్యార్థులకు అందజేస్తున్న వైద్య సేవలు అభినందనీయమన్నారు. అనంతరం 175 మంది విద్యార్థులకు నేత్ర, రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్యాన్స్‌ను సందీప్, కర్రసామును నీలపాల కృష్ణ, కోలాటాన్ని అంజలి, కరాటే, వ్యాయామాలను తెప్పల యోగేష్, లోకేష్ నేర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ గౌరవాధ్యక్షుడు బుద్ధా శ్రీనివాస్, కార్యదర్శి రొంగల అరుణ్, నమత్ర, బాషా, సందీప్, లలిత తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రాజ్య స్థాపనకు ఏకంకండి



ఆవిర్భావ దినోత్సవాల్లో నాయకులు

సామర్లకోట: కార్మిక రాజ్య స్థాపనకు అంతా ఏకంకావాలని సీఐటీయూ మండల అధ్యక్షుడు బాలం శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. సీపీఐ 55వ వార్షికోత్సవం సందర్భంగా స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని సీఐటీయూ మండల కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్ట జీవుల ఐక్య పోరాటం నినాదంలో సీఐటీయూ ఆవిర్భవించిందన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు సీఐటీయూ నిరంతరం పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకు లు విప్పర్తి కొండలరావు, కరణం ప్రసాదరావు, తుంపాల శ్రీనివాసు, కరణం గోవిందరాజు, బాలం హరి తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం



సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తపల్లి: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని వాకతిప్ప బావయ్య చెరువు వద్ద శుక్రవారం యూనియన్ జెండాను ఆవిష్కరించారు. యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ సుమారు 63 లక్షల మంది కార్మిక సభ్యత్వంతో దేశంలోనే అతిపెద్ద కార్మిక సంఘంగా కొనసాగుతూ, ప్రజల తరఫున పోరాడడంలో ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో జి.అప్పారెడ్డి, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానోద్ధారిణి దశపర్ణి

- ఈ కషాయం తెగుళ్ల నివారణలో మేటి
- గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ శిక్షణ కేంద్రంలో తయారీ
- దుర్గాడలో అధిక మొత్తంలో ఉత్పత్తి



దశపర్ణి కషాయం తయారీకి ఆకులు సిద్ధం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

పిఠాపురం: ప్రకృతి వ్యవసాయానికి పెట్టింది పేరైన గొల్లప్రోలు మండలం దుర్గాడలో వివిధ రకాల కషాయాల తయారీని ముమ్మరం చేశారు. ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తుండడంతో ఎక్కువ మొత్తంలో కషాయాల తయారీ చేపట్టారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ డీజీఎం ఎలియాజర్ ఆధ్వర్యంలో దుర్గాడ గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీ, శిక్షణ కేంద్రంలో ప్రత్యేక కషాయాల తయారీ చేపట్టారు. వివిధ రకాల పంటలకు వీటిని పిచికారీ చేయడానికి కషాయాలు సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం 400 లీటర్ల దశపర్ణి కషాయాన్ని తయారీ ప్రారంభించారు. పది రకాల ఆకులతో ఈ కషాయం తయారు చేయడానికి సుమారు 40 రోజులు పడుతుందని దుర్గాడ గో గాయత్రి ప్రకృతి వ్యవసాయ వనరుల తయారీ శిక్షణ కేంద్రం నిర్వాహకుడు గంద్ర శివ చక్రం తెలిపారు.

తయారీ ఇలా..

సుమారు 200 లీటర్ల సామర్థ్యం గల డ్రమ్ములో 150 లీటర్ల నీటిని వేస్తారు. 10 గ్రాముల ఇంగువ, 20 కేజీల దేశీ తాజా ఆవుపేడ, 20 లీటర్ల ఆవు మూత్రం మొదటి రోజు వేస్తారు. 24 గంటల అనంతరం 2 కేజీల అల్లం, 2 కేజీల పచ్చిమిర్చి, 2 కేజీల వెల్లుల్లి, 2 కేజీల పొగాకు, అర కేజీ పసుపు వేసి ఊరబెట్టాలి. మూడో రోజు 5 కేజీల వేపాకులు, 2 కేజీల చొప్పున గానుగ ఆకులు, సీతాఫలం ఆకులు, ఆముదం ఆకులు, ఉమ్మెత్త, వావిలాకు, బొప్పాయి, చేమ, తూటికాడ, జిల్లేడు వంటి పది రకాల ఆకులు వేస్తారు. ఈ మిశ్రమాన్ని ప్రతి రోజు ఉదయం సాయంత్రం కలుపుతుండాలి. 40 రోజుల తరువాత ఈ మిశ్రమాన్ని వడకడితే 200 లీటర్ల డ్రమ్ముకు సుమారు 150 లీటర్ల కషాయం తయారవుతుంది.

తెగుళ్లు పురుగుల నివారణకు

ఈ కషాయం అన్ని రకాల పంటలకు వ్యాపించే తెగుళ్లు, పురుగుల నివారణకు అద్భుతంగా పని చేస్తుందని శివచక్రం తెలిపారు. గత ఐదేళ్లుగా దీనిని తయారు చేసి రైతులకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇది లీటరు రూ.40కు విక్రయిస్తున్నామని ఎకరానికి సుమారు 3 లీటర్ల నుంచి 5 లీటర్లు పిచికారీ చేస్తే ఏ విధమైన తెగులు పురుగులు ఆశించవన్నారు. కేవలం రూ.200 ఖర్చుతో రైతులు తమ పంటలను కాపాడుకోవచ్చని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఇక్కడ తయారు చేసిన కషాయాలు ఇతర జిల్లాలకు చెందిన రైతులు వచ్చి తీసుకువెళ్తున్నారని ఆయన తెలిపారు. ఈ కషాయం పిచికారీ చేసిన పంటలు చాలా ఆరోగ్యవంతంగా ఉంటాయన్నారు. వీటి పిచికారీ వలన భూమి కూడా తెగుళ్లను తట్టుకునే శక్తిని పెంచుకుంటుందన్నారు. ప్రస్తుతం పకృతి వ్యవసాయంలో ఈ కషాయం మంచి ఫలితాలను ఇస్తోందన్నారు. అందుకే దీనిని పెద్ద మొత్తంలో తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రానున్న ఖరీఫ్‌కు ఎక్కువ మొత్తంలో దీనిని సిద్ధం చేస్తున్నామన్నారు. అన్నీ ప్రకృతిలో లభించే ఆకులు అలములే కాబట్టి దీని తయారీకి పెద్దగా ఖర్చు కూడా ఉండదన్నారు.

కషాయాలదే ప్రధాన పాత్ర



ప్రకృతి వ్యవసాయంలో అత్యంత ప్రాధాన్యం కషాయలకే ఉంటుంది. ఎటువంటి రసాయనాలు లేకుండా కేవలం ప్రకృతిలో లభించే ఆకులు, దేశీయ ఆవు మూత్రం, పేడలతో కషాయాలు తయారు చేస్తున్నాము. వీటి వల్ల వ్యవసాయంలో పంటలకు ఎంతో మేలు జరుగుతోంది. తక్కువ పెట్టుబడితో అందరు తమ ఇళ్ల వద్దే తయారు చేసుకునే వీలు వీటికి ఉంది. గొల్లప్రోలు మండలం దుర్గాడలో ఎక్కువ మొత్తంలో కషాయాలు తయారు చేసి ఇతర ప్రాంతాల రైతులకు అందుబాటులోకి తీసుకువస్తున్నాము. ప్రస్తుతం ఈ కషాయలకు మంచి డిమాండ్ ఉంది. రసాయన ఎరువులు పురుగు మందుల వల్ల పంట భూములు తన స్వభావాన్ని, శక్తిని కోల్పోయి నిస్సత్తువగా మారడం వల్ల పంటలకు ఎక్కువగా పురుగులు, తెగుళ్ల ఆశిస్తున్నాయి. వీటిని అరికట్టాలన్నా భూమిని సారవంతం చేయాలన్నా ఒక్క ప్రకృతి వ్యవసాయానికే సాధ్యమవుతుంది. అందుకే ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా రైతులను చైతన్యవంతులను చేసి అవగాహన పెంచుతున్నాం. రైతులు కూడా ముందుకు వస్తున్నారు.

– ఎలియాజరు.
ప్రకృతి వ్యవసాయ శాఖ డీపీఎం, కాకినాడ



దశపర్ణి కషాయం తయారీకి ఇతర పదార్థాలను సిద్ధం చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది



దశపర్ణి కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రామలింగేశ్వరునికి రెట్టింపు ఆదాయం

భూముల వేలంలో రికార్డుస్థాయిలో పాట

పిఠాపురం: గొల్లప్రోలులోని రామలింగేశ్వర దేవస్థానం భూముల వేలంలో రికార్డు స్థాయిలో ఆదాయం లభించింది. దేవస్థానానికి చెందిన సర్వే నంబరు 41లోని 10.90 ఎకరాల భూమిని ఏడాది కాల పరిమితికి ఆలయంలో టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. వేలంలో 18 మంది పాల్గొనగా సిద్ధా వీరబాబు రూ.3.22 లక్షలకు ఏడాది శిస్తు చెల్లించేలా పాడుకున్నారు. గత ఏడాది శిస్తు రూ.1.72 ఉండగా ఈ ఏడాది రెట్టింపు రావడంతో రికార్డు స్థాయిలో ఆలయానికి ఆదాయం లభించిందని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖాధికారులు అశ్విని, ఆలయ చైర్మన్ గొల్లపల్లి పెద్ద బాబి తదితరులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకుంటున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పు మరిడమ్మ తల్లికి ప్రీతికరమైన శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమంతో పాటు బంగారు పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

- డిప్యూటీ ఎంపీడీఓ భైరవమూర్తి



సామర్లకోట మండల పరిషత్తు కార్యాలయంలో యోగా శిక్షణ

సామర్లకోట: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని డిప్యూటీ ఎంపీడీఓ మల్లాడి భైరవమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వేట్లపాలెం, వీకే రాయపురం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన యోగా శిక్షణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో యోగా భాగం కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు నిత్యం ఉదయం కనీసం గంట సమయం యోగాకు కేటాయించాలన్నారు. ప్రతి గ్రామంలోని ప్రజలు యోగాపై అవగాహన పెంచుకుని, వారు శిక్షణ పొందడానికి గ్రామాలలోని అధికారులకు శిక్షణ ఇస్తారన్నారు. శిక్షణ పొందిన సిబ్బంది ఆయా గ్రామాలకు వెళ్లి గ్రామస్తులకు యోగా శిక్షణ ఇవ్వాలన్నారు. మండల పరిధిలోని సిబ్బందికి ఈ నెల 31 వరకు నిత్యం ఉదయం ఏడు నుంచి 9 గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సిబ్బంది గ్రామాల్లో జూన్ 21 నాటికి యోగా శిక్షణ పూర్తి చేయాల్సి ఉంటుందని చెప్పారు. జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు యోగ శిక్షణపై ప్రతి అధికారి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. యోగా శిక్షణను లక్ష్మణ కుమార్, జగదాంబ, రవి శ్రీనివాసు, బంగారాజు నిర్వహించారు. ఏఓ సతీష్, సీనియర్ అసిస్టెంట్ జగన్నాథరావులు పాల్గొన్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ఎ.శ్రీవిద్య ఆధ్వర్యంలో యోగా శిక్షణ నిర్వహించారు. అలాగే స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో బ్రహ్మకుమారీలు యోగా శిక్షణ నిర్వహించారు.

కిశోరి వికాసంపై వేసవి శిక్షణ



కొండెవరంలో బాలికలకు అవగాహన కల్పిస్తున్న దుర్గారాణి

కొత్తపల్లి: ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు అంశాలపై కిశోరి బాలికలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల హక్కుల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయకుమారి ఆదేశాల మేరకు పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ దుర్గాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని కొండెవరం గ్రామ సచివాలయంలో కిశోరి వికాసంపై వేసవి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గారాణి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడడానికి ప్రయత్నిస్తున్నారు. ఎంత సంపాదించామన్నది కాకుండా ఎంత ఖర్చు చేస్తున్నాం, ఎంత పొదుపు చేస్తున్నాం అనే అంశంపై ప్రణాళిక ఉన్నట్లయితే సమాజంలో ఆర్థిక ఉన్నత స్థాయికి ఎదగడానికి అవకాశం ఉందన్నారు. సైబర్ నేరాలపై సమాచారం ఇవ్వడానికి 1930కి ఫోన్ చేయాలన్నారు. విద్య స్థిరమైన, సంతోషకరమైన జీవితానికి దోహదపడుతుందన్నారు. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని అందిస్తుంది. తప్పు ఒప్పులపై అవగాహన కలిగిస్తుంది. బాలలకు సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా బాలల హెల్ప్ లైన్ 1098కు ఫోన్ చేసి సమాచారం అందించలన్నారు. ఈ కార్యక్రమంలో కిశోరి బాలికలు పాల్గొన్నారు.

చురుగ్గా విద్యుత్ స్తంభాల మార్పు

సామర్లకోట: విద్యుత్ స్తంభాల మార్పులు చురుగ్గా సాగుతున్నాయి. బ్రౌన్‌పేట నుంచి పిఠాపురం రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు రోడ్డు మధ్యలోకి రావడంతో వాటిని మార్చాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం విద్యుత్ స్తంభాల మార్పు ప్రక్రియను ప్రారంభించారు. ఈ పనులను ఏఈ రమేష్‌కుమార్ పర్యవేక్షించారు. విద్యుత్ స్తంభాల మార్పుతో పాటు లైన్ల మార్పు వల్ల బ్రౌన్‌పేట నుంచి కోదండరామపురం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

మత సామరస్యానికి సమైక్య యాత్ర



పెద్దాపురంలో సీపీఎం ర్యాలీ

సామర్లకోట: మత సామర్యం, దేవ సమగ్రత, పరిరక్షణకు సమైక్య యాత్ర నిర్వహించనున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి కరణం ప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానిక గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహం, బళ్లమార్కెట్‌లో అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులు అర్పించి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద రావు మాట్లాడుతూ దేశ సామరస్యానికి ఆటంకం కలిగించేందుకు కొంత మంది నాయకులు చూస్తున్నారని అన్నారు. ఇటీవల జరిగిన ఉగ్రదాడిలో అనేక మంది హిందువులు చనిపోయారని, అలాగే ఉగ్ర దాడి నుంచి అనేక మందిని ముస్లింలు కాపాడారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టేందుకు రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. ఇటువంటి విషయాలను ప్రజలకు తెలియజేయడానికి మత సామర్యానికి యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలం శ్రీనివాసు, పి.వీరబాబు, బాలం హరిబాబు, తుంపాల శ్రీనివాసు, కరణం ఏడుకొండలు, కరణం గోవిందరాజులు పాల్గొన్నారు.

పెద్దాపురంలో..

పెద్దాపురం: దేశ సమైఖ్యత వర్ధిల్లాలని, ఉగ్రవాదం–మతోన్మాదం నశించాలని నినాదాలు చేస్తూ, సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పెద్దాపురంలో దేశ సమైఖ్యత ర్యాలీ నిర్వహించారు. స్థానిక సినిమా సెంటర్‌లో బొమ్మన బసవరాజు విగ్రహానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నీలపాల సూరిబాబు, చల్లా విశ్వనాథం పూలమాల వేసి, ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ వెంకటేశ్వరస్వామి దేవాలయం, వేముల వారి సెంటర్ మీదుగా గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. సత్తిబాబు, చింతల సత్యనారాయణ మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ర్యాలీని ఉద్దేశించి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ అమెరికా ఆధిపత్యానికి లొంగిపోయిన బీజేపీ ఉగ్రవాదులపై దాడిని విరమించుకుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి దారపురెడ్డి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇళ్ల స్థలాల కోసం పోరాటం

- జూలై 15, 16 తేదీల్లో పార్టీ జిల్లా మహాసభలు
- సీపీఐ నేత తాటిపాక మధు



సీపీఐ సమావేశంలో మాట్లాడుతున్న మధు

సామర్లకోట: పేదలకు పట్టణ పరిధిలో రెండు సెంట్లు, రూరల్ పరిధిలో మూడు సెంట్ల మేర ఇళ్ల స్థలాలు ఇచ్చేంత వరకూ పోరాటం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు అన్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి పెదిరెడ్ల సత్యనారాయణ అధ్యక్షతన స్థానిక విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో శుక్రవారం జరిగిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పేదలకు ఇళ్ల స్థలాల కోసం తహసీల్దార్లకు, కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేసినప్పటికీ చంద్రబాబు ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయలేదని విమర్శించారు. జిల్లాలో ఇసుక, మట్టి మాఫియా పెరిగిపోయిందని అన్నారు. దీనిపై అనేక ఫిర్యాదులు చేసినా నాయకులు, అధికారులు స్పందించడం లేదని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మున్సిపల్ భవన నిర్మాణ కార్మికులను న్యాయం చేస్తామని చెప్పిన కూటమి నాయకులు ఇప్పటికీ ఆ హామీ నెరవేర్చలేదని అన్నారు. సామర్లకోటలో జూలై 15, 16 తేదీల్లో నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని మధు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ మాట్లాడుతూ, యు.కొత్తపల్లి మండలం కొమరగిరి లే అవుట్‌లో సీపీఐ ఆధ్వర్యాన దరఖాస్తు చేసిన పేదలందరికీ ఇళ్ల స్థలాలివ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ పిఠాపురం నియోజకవర్గ కార్యదర్శి కేశవరపు అప్పలరాజు, మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ నె.భవాని, పెద్దాపురం పట్టణ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కో ఆపరేటివ్ బ్యాంకులతో మేలు



ఖాతాదారులను సత్కరిస్తున్న బ్యాంకు అధికారులు

పిఠాపురం: కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంకుల ద్వారా సామాన్య, మధ్య తరగతులకు మేలు కలుతుందని విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ ఇన్‌చార్జి డైరెక్టర్ నామన కామరాజు అన్నారు. శుక్రవారం పిఠాపురంలోని కేవీకేటీ కల్యాణ మండపంలో నిర్వహించిన బ్యాంక్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వివిధ అంశాలపై చర్చించారు. విశాఖ కో ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్లు డాక్టర్ కృష్ణమోహన్‌రావు, జేవీ సత్యనారాయణ మూర్తి, బ్రాంచి మేనేజర్ గంధం రవి కుమార్ సమావేశంలో పాల్గొని బ్యాంకింగ్ రంగం, ప్రభుత్వ విధానాలు, సవాళ్లపై చర్చించారు. ఈ సందర్భంగా ఇటీవల పెహల్గామ్ పై ఉగ్ర దాడులు, పాకిస్థాన్‌తో భారత్ యుద్ధం, ట్రంప్ ఆంక్షలు వంటివి బ్యాంకింగ్ రంగాన్ని ఏలా ప్రభావితం చేశాయో, వాటిని బ్యాంకులు ఏలా తట్టుకుని మనుగడ సాధిస్తాయనే దానిపై చర్చించారు. ప్రస్తుతం విశాఖ కో ఆపరేటివ్ బ్యాంక్ విస్తరణ, విధి విధానాలు, బ్యాంకింగ్ రంగలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొనే తీరుపై వివరించారు. ఈ బ్యాంక్ ద్వారా సామాన్యులకు అందుతున్న సేవలను పలువురు సభలో తెలిపారు. తక్కువ వడ్డీ విధానం, ఎక్కువ రుణ సదుపాయంతో పాటు, సులభ వాయిదాలలో చెల్లింపులు, రైతులకు మేలు చేకూర్చే పద్ధతులను డైరక్టర్లు వివరించారు. అనంతరం బ్యాంకులో 10 ఏళ్లకు పైగా ఖాతాలు నిర్వహిస్తున్న సీనియర్ ఖాతాదారులను ఘనంగా సత్కరించారు. సమావేశంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

చెత్త ప్రతిపాదన మళ్లీమళ్లీ..!

- సర్కారు సొమ్ము దోపిడీకి ఇదో మార్గం
- ఒకే పనిని పలు విధాల విడగొట్టి రూ.4.71 లక్షలతో ప్రతిపాదనలు
- గతంలో కౌన్సిల్ రద్దు చేసినా అజెండాలో చేరుస్తున్న వైనం
- నేడు పిఠాపురం మున్సిపల్ సమావేశం



పిఠాపురం మున్సిపల్ కార్యాలయం

పిఠాపురం: మున్సిపాలిటీలో ప్రజల సొమ్మును దోచుకోడానికి అధికార పార్టీ నేతలు, అధికారులు చెత్తను కూడా వదలడం లేదు. పిఠాపురం మున్సిపల్ సమావేశం శనివారం జరగనుండగా కౌన్సిల్ తీర్మానం కోరుతూ అధికారులు అజెండా సిద్ధం చేశారు. దీనిలో పిఠాపురం పురపాలక సంఘం పరిధిలో గల సీతారామపురం ప్రాంతంలో ఉన్న డంపింగ్ యార్డులోని చెత్తను చదును చేయడానికంటూ ఎజండాలో 2వ అంశంగా రూ.81 వేలతో ఒక ప్రతిపాదన చేశారు. ఇదే పనిని 3 అంశంగా రూ.40 వేలతో, 4వ అంశంగా మళ్లీ రూ.81 వేలతో, 5వ అంశంగా రూ 94,300తో, 6వ అంశంగా రూ.81 వేలతో, 7వ అంశంగా రూ 93,500తో మళ్లీ మళ్లీ అవే పనులను ప్రతిపాదించారు. ఇవన్నీ కేవలం డంపింగ్ యార్డులో చెత్తను సరి చేయడానికేనన్నది గమనార్హం. వీటిని మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించిన కౌన్సిల్ సమావేశాల్లో సభ్యులు తిరస్కరించారు. అయినప్పటికి మళ్లీ వాటినే కొత్తగా ప్రస్తుత సమావేశంలో ప్రతిపాదించారు. రూ.లక్ష దాటితే ఈ ప్రొక్యూర్‌మెంటు చేయాల్సి ఉండడంతో వాటిని ఆరు పనులుగా విడగొట్టి ప్రతిపాదించారు. ఈ పనులను జనసేనకు చెందిన ఒక నాయకుడికి కట్టబెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. కేవలం డంపింగ్ యార్డులో ఉన్న చెత్తను జేసీబీలతో సర్ది దారి చేయడం వంటి పనులను చేయడానికి ఏకంగా రూ.4.71 లక్షల నిధులు కేటాయించాలని నిర్ణయించడం అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే రెండు సార్లు రద్దు చేసిన పనులను మళ్లీ ప్రతిపాదించి ఆమోదించుకోవాలని మున్సిపల్ అధికారుల ద్వారా జనసేన నేతలు వత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై శనివారం జరగనున్న కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఎలా స్పందిస్తారో చూడాలి మరి.

పిఠాపురం.. మాకొద్దు బాబోయ్!

- మున్సిపాలిటీ నుంచి బదిలీలకు భారీగా దరఖాస్తులు
- ఇప్పటికే ఖాళీ అయిన కీలక పోస్టులు

పిఠాపురం: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం అంటే అధికారులు హడలెత్తిపోతున్నారు. ఇక్కడ ఉండలేం.. మమ్మల్ని బదిలీ చేయండంటూ ఉన్నతాధికారులకు మొర పెట్టుకుంటున్నారు. ఒక్క పిఠాపురం మున్సిపాలిటీ నుంచే ఎక్కువ మంది బదిలీలకు దరఖాస్తులు చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే పిఠాపురం మున్సిపాలిటీలో డీఈ లాంగ్ లీవ్‌లో ఉన్నారు. ఆర్ఓ, ఆర్ఐ, ముగ్గురు ఏఈలు, ముగ్గురు జూనియర్ అసిస్టెంట్లు, ఎఫ్1, మేనేజర్, రికార్డు అసిస్టెంట్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పారిశుద్ధ్యం, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, కార్యాలయ సిబ్బందిలో 90 శాతం మంది తమను బదిలీ చేయాలంటూ దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. పిఠాపురంలో కూటమి నేతల పెత్తనం ఎక్కువైపోవడం, ప్రతి ఒక్కరూ నాయకుడినంటూ అధికారులపై జులుం ప్రదర్శించడం వంటి కారణాలతో ఇక్కడ పని చేయలేకపోతున్నామని వాపోతున్నారు. పని చేయాలని ఒకరు.. వద్దని మరొకరు ఒత్తిడి తెస్తూండటంతో అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ముఖ్యంగా జనసేన నేతల తీరుతో తాము నిత్యం నరకం చవి చూస్తున్నామని పలువురు సిబ్బంది తోటి వారి వద్ద వాపోతున్నట్లు సమాచారం. ఇదే బాటలో వార్డు సచివాలయాల సిబ్బంది కూడా ఎప్పుడు బదిలీ చేస్తే అప్పుడు వెళ్లిపోవాలని చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పిఠాపురం మున్సిపాలిటీ చరిత్రలో ఎక్కువ మంది బదిలీలకు దరఖాస్తులు చేయడం ఇదే తొలిసారని చెబుతున్నారు. ఐదేళ్ల పదవీ కాలం పూర్తయిన వారు ఇద్దరే ఉండగా మిగిలిన వారందరూ ఐదేళ్లు పూర్తి కాకపోయినా తమను బదిలీ తప్పనిసరిగా చేయాలని కోరుకోవడం గమనార్హం.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

సామర్లకోట: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్టు కార్మికుల సమ్మె శుక్రవారంతో 24వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ అధికారులు, పాలకుల నుంచి ఎటువంటి స్పందన లేక పోవడంతో మున్సిపల్ కార్యాలయం ఎదుటనే సమ్మె కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్ల సంఘం అధ్యక్షుడు ఉండవిల్లి రామరాజు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ శుక్రవారం «చలో రామచంద్రపురం» పిలుపు ఇచ్చామని, అయితే మంత్రి అందుబాటులో లేరని తెలిసి వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రభుత్వంతో చర్చలు జరిగే అవకాశం ఉన్నదని, చర్చలు విఫలమైతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఏడు నెల క్రితం సీడీఎంఏ చర్చ పేరుతో తమ సమస్యల పరిష్కారానికి మూడు నెలల సమయం కోరారని, అయినా నేటికీ పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాపవరపు నూకరాజు, పులపకూర రామకృష్ణ, మేడిబోయిన వెంకన్న, నక్క రత్నంరాజు పాల్గొన్నారు.

తీరంలో అల కల్లోలం

- అల్పపీడనంతో వణుకుతున్న తీరం
- తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



చిన్న వంతెన వద్ద అలల ఉధృతి

కొత్తపల్లి: అల్పపీడనంతో తీరంలో సముద్ర అలలు విరుచుకుపడుతుండడంతో తీరంలో కల్లోలం నెలకొంది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసి పడుతున్నాయి. ఉప్పాడ, కోనపాపపేట తీరప్రాంతాల్లో ఉన్న ఇళ్లు కోతకు గురవుతున్నాయి. తీర ప్రాంతానికి రక్షణగా ఉన్న గోడ రాళ్లు సైతం అలల తాకిడికి గ్రామంలోకి వచ్చి పడ్డాయి. కెరటాల తాకిడికి ఉప్పాడ–కాకినాడ బీచ్ రోడ్డు కోతకు గురైంది. ఈ పరిస్థితులతో ప్రయాణీకులు ఆందోళనకు గురవుతున్నారు.

అధికారులు అప్రమత్తం

అల్పపీడనం హెచ్చరికల నేపథ్యంలో తీరప్రాంతంలో ఉన్న ప్రజలను అధికారులు అప్రమత్తం చేయాలని తహసీల్దారు చిన్నారావు అన్నారు. కార్యాలయంలో తుపాను హెచ్చరికలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పాడ నుంచి కోనపాపపేట వరకూ ఉన్న తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండి అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రతి గ్రామంలో ప్రత్యేకాధికారులతో బృందాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ముఖ్యంగా తుపాన్ షెల్టర్లను అందుబాటులో ఉంచాలన్నారు. అవసరం అయితే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు.